కథ

# జెట్ట రోగం

క్రాంతి శివరాత్రి
99515 90398

“ఆకలయితాందే''. ఎగిలిబారంగాల్నే రాజు గాడు అట్ల అడిగేసరికల్ల ఎల్లవ్వ మనసు కలుక్కు మన్నది.

పాడు ఆకలి. రాజుగానికి రాతిరి సుత ఆక లాయే. సర్వలేమో యింత బువ్వ లేకపాయే. ఐనా అండుతందుకు రాజుగానికి ఆరేళ్లుంటయి. పోరనికి జర మొచ్చింది. వొళ్లు అగ్గి లెక్క మండ్తాంది. రెండ్రోజుల సంది ఆపతి వడ్తాండు. గది సూశి మల్లడూ బాధవడ్తనే వున్నడు. కానీ దవ్కనకు తీస్కవోను ముసలోని శేతిల పైసలేడియి.

‘వున్నొక్క పోరనికి బుక్కెడు బువ్వ గూడా వెట్టలేక వోతుంటిమయ్యా’ అన్న ఎల్లవ్వ మాటలకు, గుడిసెకు గంతదూరం వోయి దోశేడు కన్నీళ్లకు యెక్కువ యెడ్శిండు మల్లడు. కొడుకు ఫొటో సూసుకుంట.. ‘‘ఐనా ఆడు బతికుంటే నా మూసలోనికి ఈ గతి వట్టేది కాదని’’ ఎల్లవ్వ బాధవడ్డది.

యాదిగాడు.. మల్లని కొడుకు. ఆడు సచ్చి మూడేళ్ల యితాంది. అమ్మా నాయినల్ని యిడ్సివెట్టి.. పోరన్ని, యింటామెని యెంటెస్కోని బాయి పనిజేయ్య దేశం వొయ్యిండు. మట్టిపెళ్లలు కూళీ, అయ్యి మీద వడి పాణ మిడిశిండు. మూడేళ్ల రాజుగాడ్ని సంకలేస్కోని, పెనిమిటి పినిగని యేడ్సుకుంట యింటికి యేస్కచ్చింది కోడలు సుభద్ర. పటేళ్లు.. ఆ సచ్చిన పాణానికి రెండు వేలిచ్చి శేతులు దులుపుకున్నరని జెప్పి, అయ్యి మావకు అప్పజె ప్పింది.

సావూ, దినాల ఖర్సులకే గా పైసలు వడ్శినయి. దినా లెల్లిన మూడ్రోజులకు కోడలు యింట్ల నుంచి మాయ మైంది. దోలాడి అల్శిపోయిన కులపోల్లు, పెనిమిటి వొయ్యిండన్న బాధల.. పిచ్చిలేశి యేటో తప్పివొయింద న్నరు. అటుపక్క ఎల్లవ్వకీ పాణం కరబైంది. ఇగ గప్పటి సంది మల్లడొక్కడే కూలీ నాలి జేత్తూ ముసల్దానికీ మనవ డికి అన్ని అయి సూత్తాండు.

మట్టిపని తప్పించి మల్లనికి మరేపని రాదు. కాలు వల్ని, బావుల్ని తవ్వట్ల అన్నీ తీసి పడేసేటోడు లేడు. ఐనా పెద్ద పెద్ద అంత్రాలచ్చీ శేతి పని జేసేటోళ్ల వుపాధికి గండి గొట్టే గదా. అన్ని సోట్ల ఆళ్లకు పని దొరుకుడు కస్ట మైంది.

రాజుగాడు ఆనాథైన కాడ్నుంచి ముసలోళ్లిద్దరూ సొంతూరనే మాటే మర్శిర్రు. కొడుకూ కోడలి లెక్కనే ఏ వూర్లె పనుందని తెల్సినా.. కడుపు శేత వట్టుకుని పోరడ్ని యెంటెసుకుంటున్నరు. కులపోల్లతో గల్సి ఆ సోటుకి వోతున్నరు. పని నడిశినన్ని రోజులూ గుడిసేలేస్కొని గక్కడే వుంటున్నరు. పని ఐపోయ్యిన్నాడు.. గిట్లనే మళ్లో కాడికి వలసవోతూ సంచార జీవితం గడుపుతున్నరు.

ఈ వూరికచ్చి గూడ కొద్ది దినాలే ఐతాంది. వచ్చీ రాంగానే మూడ్రోజుల పనైతే దొరికింది. అట్లొచ్చిన పైసల్తో యిన్ని దినాలూ పూట గడ్శింది. కానీ ఆరం సంది మళ్ల పనెక్కడిది!

ఏ వూరికి వొయినా పనిల కుదుర్కొనికి టైం వడ్తది. గుత్తదార్లూ, మేస్త్రీలు పరిచయం గావలే. యేడేడ యే పనులైతున్నయో తెల్సుకోవాలే. కులపోల్లల్లో జరంత సదువచ్చినొల్లిద్దరు అటువొయ్యి కూలీ మాట్లడుకరా వాలే.

దినాం పని దొర్కుతనే నాలుగు పైసలు కండ్ల జూస్తడు మల్లడు. రెక్కలిర్గా జేయంగచ్చే ఆ పైసలు ఐద్రోజులు గూడా సరిపోవు. వొక్కోపారి రోజులకద్దీ పనే దొరకదు. గట్లయితే పొట్ట నిండదు. యింతకుమున్పు గాశారం బాలేక పస్తులుండాల్శిన దినాలు గూడా అచ్చే గానీ, రాజుగానికిన్ని గంజి మెతుకులైనా వెట్టిర్రు. కానీ యీసా రట్ల గాలే. పోరనికి మందుగోళి యెయ్యనికి గూడా శేతిల పైసా లేకుంటైంది.

పక్కపోంటి యేడెనమిది గుడిసెలుంటయి. ఆపతికి యెవల్నన్న సాయమడుగుదామన్నా.. మనసు రాలే. ‘ఐనా యెవలు సాయమైతరు! యెవలి కస్టాలాళ్లయి. యే పూటకాపూట జేస్కుంటనే పూట గడిశే యెట్టి బతు కులు గదా’ అనుకుండు.

* * *

పోరడు ‘‘అమ్మా, అమ్మా’’ అనుకుంటా జరంతోనే మూల్గుతున్నడు. ఆకలైతున్నట్టు పొట్టని వత్తుకుంట సాప మీదనే అటీటూ బొర్లుతున్నడు. మనవడినట్ల సూశి ముసలోని కండ్లకు మళ్లా నీళ్లచ్చినయి.

‘యింకెక్కడి అమ్మ కొడ్కా. అసలుందో లేదో దెల్వని గతివట్టే నీకు.

కొడుకుని వోగొట్టుకున్న నాకేమో.. యీ గతివట్టే.’

అని మనసులనుకుంట మళ్లోపారి కుమ్లివొయ్యిండు.

* * *

కులపోళ్ల సప్పుడినిపిచ్చి గుడిసె బయటకచ్చిండు మల్లడు. అప్పుడే ఎగిలిబారిన.. రాబోయ్యే యెండ సూశనగా వొంటికి యేడిగా తగుల్తాంది. ఎగిలిబా రకమున్నే పటేళెవరో అచ్చి పని జెప్పినట్టు కులపోల్లంతా తయారైతున్రు. కూలీకి పోవాలన్నట్టు దబ్బదబ్బ గట్కా తిని, గిన్నెలు కడుక్కుంటున్రు. కావ్ కావ్ మని అర్సనికి గూడా వోపిక లేనట్టే నాలుగైదు కాకులు యేపశెట్టు మీదచ్చి కుసున్నయ్. యే గుడిసె ముందైనా యిన్ని మెతు కులు వడ్తయని నోరు తెర్శీ, కండ్లప్పగిచ్చి అటీటూ సూత్తు న్నయి. కాకుల్ని సూస్కుంట యింత పండ్ల పుల్ల తెంపి నోట్లే సుకుండు మల్లడు.

కులపోల్లంతా ఆగమాగం గుడిసెల్లోంచి బైటికొత్తున్రు. ఆడోళ్లంతా గోశిలు పెట్టుకున్రు. మొగోళ్లంతా లుంగీలు సరి చేసుకున్రు. నేలమీది పారలూ, గడ్డ పారల్ని యెడమ కాలితో లేవదన్నీ వంగకుండానే ఆటిని జేత వట్టుకుం టున్రు. ఆళ్ల ఆడోళ్లంతా గంపల్ల సర్దిన సద్ది మూటలు నెత్తి నెత్తుకుంటున్రు. యిదంతా జూసిన మల్లనికి గుండెల రాయి వడ్డట్టైంది. పని దొరికీ, కూలికి వోతున్నట్టు తనకె వలూ జెప్పలేదని దుక్కం పొడుసుకచ్చింది.

‘‘యేమాయేరా పని దొరికేనా? వొక్కడూ జెప్తలేడే మిరా?’’ అని సూరన్ని అడి గిండు మల్లడు.

సూరడు యినిపిం చుకోలే.

‘‘యేమా యేరా..?’’ మళ్లో పారి అడిగిండు.

‘వొయ్యేది యెంచర్ల పనికి. గాడ పెద్ద

